# బ్రతుకు జీవుడు

అది ఉదయం ఎనిమిది గంటల సమయం. ఊరికి కొద్దిదూరంలో ఉన్న రైల్వే స్టేషను పాసెంజర్లతో కోలాహలంగా ఉంది. రైల్వేస్టేషనుకు అటూ ఇటూ విశాలంగా పరచుకొని ఉన్న ప్లాటుఫారం, గొంతువరకుపూద్చబడిన రాక్షసుడు తన పొడవైన చేతుల్ని ఆవైపు ఈవైపు చాపినట్లుగా ఉంది. రైలు రావడానికి ఇంకా పది నిమిషాలు సమయముంది.

కొద్దిసేపట్లో రైలు పెద్దగా ఓ ఆకలికేకవేస్తూ స్టేషనులో వచ్చి ఆగింది. గమ్యస్థానం చేరాంగదా అన్న భరోసాతో 'నిదానమే ప్రధానం' అన్నట్లు పాసెంజర్లుదిగుతూంటే, 'ఆలస్య అమృతం విషం' అన్నట్లు ఆలస్యంగా ఎక్కితే తమకెక్కడ సీట్లు దొరకవోనని, రైలెక్కడ వెళ్ళిపోతుందోనని, ప్రయాణికులు హడావుడిగా ఎక్కుతున్నారు.

మళ్ళీ రైలు కడుపునిండినవాడు త్రేన్చినట్లు పెద్దగా అరచి ఒక్క ఊపుతో తన శరీరాన్ని ముందుకు లాక్కుపోసాగింది. కిటికీలవద్ద కూర్చొన్న వారు కంగారు జంతువు కడుపులోని పిల్లల్లా కిటికీల్లో తలలుపెట్టి బయటికి చూస్తున్నారు.

ప్రసాద్ ఆ చివరినుంచి ఈ చివరివరకు కంపార్ట్‌మెంటంతా కలియతిరిగి చివరకు సీటు సంపాదించి కూర్చున్నాడు. కంపార్ట్ మెంటంతా రద్దీగా ఉంది. క్రిందంతా మురికి పేరుకొని ఉంది.

అది ఎంతమురికిగా ఉన్నా ఎంతవాసన కొడుతున్నా జనం ఆ బాధ గురించే పట్టనట్లు ఎక్కి కూర్చొంటున్నారు. సీట్లు లేని వాళ్ళు నిలబడి ప్రయాణం చేస్తున్నారు. ప్రసాద్‌కి ఎదురుగా కూర్చుని ఉన్నారు ఇద్దరు. వారు ఎదు రెదురుగా కూర్చొని ఉన్నారు. మధ్యలో పెట్టెమీద టవలు పరచి ఉంది. దానిలో పేకముక్కలున్నాయి. ప్రసాద్ కూర్చొని ఉన్న బెంచీకి, వాళ్ళు కూర్చొని ఉన్న బెంచీకి మధ్యగా ఉన్న పెట్టె మీద మరొక ఇద్దరు ఒకరి కొకరు అభిముఖంగా కూర్చొని ఉన్నారు.

బండి బయలుదేరడమే ఆలస్యం అన్నట్లు ఆట మొదలు పెట్టారు. ప్రసాద్ ప్రక్కనే కూర్చొనిఉన్న ముసలాయన జేబులోంచి చుట్టతీసి దాని చివర కొద్దిగా కొరికి తుపుక్కున ఉమ్మేశాడు. తరువాత ఒకసారి దగ్గి, చుట్ట వెలిగించాడు. ప్రసాద్ ఆ వాసన భరించలేక ముసలాయన వైపుచూశాడు.

చుట్టూ వున్నవాళ్ళు అతని పెద్దరికాన్ని గౌరవించి మౌనంగా ఉండిపోయారు.

"నాయనా ఆ కిటికీ దగ్గర కొద్దిగా సోటియ్యి. నోట్లో ఉమ్మూరుతా ఉంటాది, అప్పుడప్పుడూ ఊసుకోవాలి" అన్నాడు.

ముసలాయన అభ్యర్థనకు అప్పటివరకు కిటికీ పక్క సీట్లో ఇష్టంగా కూర్చొని ఉన్న అతను చుట్టుపక్కల వారు ఏమనుకుంటారో అని కష్టంగా లేచి ముసలాయన సీట్లో కూర్చున్నాడు. ముసలాయన ఆ వ్యక్తి సీట్లో కూర్చున్నాడు.

ఇంతలో బటానీ అమ్మేవాళ్ళు ఒకరి తర్వాత ఒకరు కంపార్టుమెంటంతా అరుస్తూ తిరిగారు. పేకాట ఆపి వేరుశనక్కాయల పొట్లాలు కొన్నారు. ఆ నలుగురూ అవి తింటూ స్వేచ్ఛగా తొక్కలు అక్కడే పడవేయసాగారు. ముందే మురికిగా ఉన్న కంపార్టుమెంటు. దీంతో మరింత మురికిగా తయారైంది.

ప్రసాద్‌కు చాలా బాధగా ఉంది. వాళ్ళ వాలకం చూస్తూంటే ఏం చెప్పినా వినేట్లులేరు. అయినా అడిగాడు ప్రసాద్.

“ముందే కంపార్టుమెంటు మురికిగా వుంది. దాన్నింకా మురికి చేయడం ఏం బాగుంటుంది.”

పేకాడుతున్న వాళ్ళు చివ్వునతలెత్తారు.

“లాభంలేదు సార్. మనం జాగ్రత్తగా ఉన్నా వేసేవాళ్ళు వేస్తూనే ఉంటారు” అన్నాడు ఒకతను.

“ప్రతి ఒక్కరం అలాఅనుకొంటే వేయక ఏంచేస్తారు.”

“మీకు రైలు ప్రయాణం కొత్తా”

“అదేంకాదు. అరుదుగా ప్రయాణంచేస్తుంటాను.”

“అయితే మీకు కొత్తగనుక విచిత్రంగావుంది మాకిది మామూలే” అంటూ పెద్దగా నవ్వాడతను. అతనికి వంతగా మిగతా ముగ్గురూ నవ్వారు.

“మీరు ధనవంతులు కనుక ఎక్స్‌ప్రెస్ రైళ్ళల్లో పోతున్నారు. పాసెంజరు ట్రెయిన్‌లో ఎక్కేది లేబర్ క్లాసండి. అటువంటప్పుడు రైళ్ళు శుభ్రంగా ఎలా వుంటాయి” అన్నాడొకతను ఓదార్పుగా. తన వాక్చాతుర్యానికి అబ్బురపడిపోతూ.

“సారీ రైల్లో అరుదుగా ప్రయాణం చేస్తానన్నంత మాత్రాన ఎక్స్‌ప్రెస్ రైల్లో వెల్తాననికాదండి అర్థం. బస్సుల్లో ప్రయాణం చేయొచ్చుగా. ఈ పాసెంజర్ ట్రెయిన్‌లో ప్రయాణం చేస్తున్న మీరు నాకంటే ధన వంతులుగా కనిపిస్తున్నారు” చురక తగిలించాడు ప్రసాద్.

“కావచ్చు ఈ ట్రెయినెక్కితే ఇక్కడి పరిస్థితులకు రాజీపడక తప్పదు” అన్నాడతను ముక్తసరిగా, సంభాషణ పొడిగించడం ఇష్టంలేనట్లు.

వీళ్ళతో మాట్లాడి ఇక లాభం లేదనుకొన్నాడు ప్రసాద్. కొద్దిసేపు గడిచింది.

ప్రసాద్ వాళ్ళ సిద్ధాంతానికి, ఆలోచనా సరళికి బాధపడుతున్నాడు.

ఇంతలో ముసలాయన ఇంకోచుట్ట వెలిగించాడు.

"తాతగారూ, చుట్ట ఆర్పెయ్యండి. ఆ ఆడవాళ్ళను చూడండి ఎలా డోకు చేసుకోబోతున్నారో" అన్నాడు ప్రసాద్.

కొద్ది దూరంలో ఉన్న ఆడవాళ్ళు డోకు రాకుండా పైటకొంగు అడ్డుపెట్టుకొని నానా బాధలు పడుతున్నారు. అతని చుట్ట పొగ పీల్చడం కంపార్టుమెంటులో ఉన్న అందరికీ బాధగా ఉంది. కాని ఏమనలేక పోతున్నారు. సమయం దొరికింది కదాని ఇప్పుడు, తలా ఒక మాట అంటున్నారు.

"ఏంది శానా ఇసిత్రంగా ఉండాదే. కమ్మంగా ఉండే ఈ సుట్ట మీకు కక్కు తెప్పిస్తుండాదా."

"అయ్యా పిల్లకు అయిదోనెల కడుపు. ఆ వాసన దీనికి పడదు. కళ్ళు తిరుగుతు తున్నాయని పడుకొంది" అంటూ తన ఒడిలో తలపెట్టుకొని పడుకొని ఉన్న కూతుర్ని చూపించింది ఒకామె.

"ఏందీ మీకు కళ్ళు తిరుగుతుండయని నాను సుట్ట ఆర్పేయాల్నా. ఏమి నాయం సెబుతున్నరండే" అన్నాడు ముసలాయన మళ్ళీ, మీసాలు మెలేస్తూ.

ఈ ముసలాయన అంత తేలిగ్గా మాట వినేరకం కాదనిపించింది ప్రసాద్‌కు.

"తాతగారూ ఆ బోర్డు చూడండి" అంటూ ఎదురుగా కంపార్టుమెంటులో తగిలించి ఉన్న 'ప్రివెంట్ ఫైర్' బోర్డు చూపించాడు.

"ఏందది ఇంగిలిపీసులో ఉండాదే. నా మనవడు కూడా పక్కన్లేడే. సదివిసెప్పడానికి. మా పిల్లోడికి ఇంగిలిపీసువచ్చులే. ఎనిమిది సదవుతుండడు" ప్రపంచంలో అతని మనవడికొక్కడికే ఇంగ్లీషు వచ్చినట్లు.

"ఫరవాలేదులే. నే చెప్తాను వినండి."

"సెప్పునాయనా. నాలాంటి బొర్రమీసాలుండేటోళ్ళకి ఏదయినా పెయిజిస్తరేమో"

"అదేం కాదు తాతా. బండిలో పొగత్రాగితే రెండేళ్ళు జైలుశిక్షగాని, మూడు వేల రూపాయల ఫైనుగాని వేస్తారంట"

ముసలాయన ఒణికిపోయాడు. అతనితో బాటు అతని మీసాలు కూడా చలించాయి. గబుక్కున చుట్టవిసిరి కిటికీలోంచి బయట పారేసాడు.

"నాయాల్ది. ఇందాకనే సెప్పగూడదంటయ్యా సామీ. ఒక సుట్ట తాగితినే. నాను నిద్దర్లేసి నా పెళ్ళాం ముఖం జూసినాను గనుక సరిపోయింది. లేకపోతే ఇయ్యారికి జైల్లో ఉండాల్సిందిగదా" అంటూ ఏడుపు ముఖం పెట్టాడు. ఆ ఏడుపు ముఖంలో కూడా సంతోషముంది. క్షణంలో జైలు శిక్షతప్పించుకున్నానుగదాని.

ముసలాయన ఇప్పటి వరకు చూపిన బింకానికి, ఇప్పటి వెలవెలపాటుకి అక్కడున్న వాళ్ళంతా నవ్వారు.

"ఈ రైల్లోనేనా. ఇంకే రైల్లో అయినా ఇంతేనా నాయనా" అనడిగాడు సందేహాస్పదంగా.

"ఈ రైల్లోనేకాదు. ఇంకే రైల్లో అయినా ఇంతే తాతగారూ. ఒక విషయం వినండి. మన ఇంట్లో వస్తువుల్ని ఎంత శుభ్రంగా ఎంత జాగ్రత్తగా ఉంచుకొంటామో ప్రభుత్వానికి సంబంధించిన అన్ని వస్తువుల విషయంలోనూ అదే శ్రద్ధ ఉండాలి. ప్రభుత్వానికి సంబంధించిన ఈ రైళ్ళు, బస్సులు, పోస్టాఫీసులు అన్నీ మనవే. వాటికి ఏదైనా నష్టం జరిగితే ఆ నష్టాన్ని మనం పన్నుల రూపంలో భర్తీ చేసుకోవలసి ఉంటుంది" అంటూ ఒక దీర్ఘోపన్యాసమిచ్చాడు ప్రసాద్.

దాంతో ముసలాయన మహా ఆనందపడి పోయాడు.

"భలే... భలే.. ఎంత బాగా చెప్పావు నాయనా, నీలాంటోడు పెట్టె కొకడున్నా దేశం బాగుపడుద్ది" అన్నాడు.

"పెట్టె కొకడుకాదు పెద్దాయనా ఊరికొకడుండాలి. పెట్టె కొకడుంటే రైల్వే డిపార్టుమెంటు మాత్రమే బాగుపడుతుంది. అదే ఊరికొకడుంటే దేశం బాగుపడుతుంది" అన్నాడు పేకాట ఆడుతున్న వాళ్ళలో ఒకడు వ్యంగ్యంగా.

మిగతా ముగ్గురూ నవ్వవలసిన బాధ్యత తమమీదున్నట్లు నవ్వారు.

ఇంతలో రైలు ఒక చిన్న స్టేషనులో ఆగి మళ్ళీ బయలుదేరింది.

ట్రెయిను బయలుదేరే సమయంలో ఒక వ్యక్తి కంపార్టుమెంటులో ప్రవేశించాడు. నల్లగా ఉన్నాడు. తలంతా జడలు కట్టి వెంట్రుకలు అట్టలుకట్టుకుపోయి ఉన్నాయి. చేతిలో వేపమండల కట్ట ఉంది.

తనొక అస్పృశ్యుడిలా తన శరీరం ప్రయాణీకులకు తగలకుండా జాగ్రత్తపడుతూ క్రిందకూర్చొని వేపమండలతో కంపార్టు మెంటును తుడుచుకొంటూ వస్తున్నాడు. పదిహేన్నిమిషాలలో కంపార్ట్ మెంటంతా క్లీనయిపోయింది. పోగయిన చెత్త చెదారాన్నంతా వాకిట్లోంచి కిందికి తోసేశాడు.

తరువాత రెండు చేతులు చాచి "బాబూ ధర్మం" అంటూ ప్రతి ఒక్కరి దగ్గరకూ వస్తున్నాడు. వేసిన వాళ్ళు వేస్తున్నారు. ఇష్టంలేని వాళ్లు విసుక్కొంటున్నారు. ఇప్పటి వరకూ ఇంతమురికిలోనే కూర్చొని ఉన్నారు. అలాంటిది ఒక అనామకుడు శ్రమకోర్చి కంపార్ట్ మెంటంతా క్లీన్‌చేసి, ధర్మం చెయ్యండని అడిగితే కసురు కొంటున్నారు.

"దూరం గుండు. ఛ... ఛ... వీణ్ని చూస్తేనే డోకొస్తోంది" అన్నాడు పెద్దాయన, అంతవరకు తన చుట్టపొగకు ఎంతమంది డోక్కొబోయారో అన్న సంగతి మరచి పోయాడు.

ఇంతలో అనామకుడు పేకముక్కలు పంచుకొంటున్న వాళ్లకు కొద్ది దూరంలో నిలబడ్డాడు.

యధాప్రకారం "బాబూ ధర్మం" అన్నాడు దీనంగా. వాళ్ళు పట్టించుకోలేదు. మళ్ళీ అడిగాడు.

"ఒరేయ్ ఎవడు తుడవమన్నాడ్రా నిన్ను" అడిగాడు వాళ్ళలో ఒకతను.

"ఎవరూ చెప్పలేదుసామే. ఏదో కష్టపడితే పైసలు ధర్మం చేస్తారని నేనే ఊడ్చాను"

"ఒరేయ్ అసలు నీకు టికెట్టుందా" అలా అడిగినతనికి సీజన్ ఎక్స్పైరయి పదిరోజులయింది. అప్పట్నుంచి టికెట్ లెస్ ట్రావెలర్.

"అడుక్కొనే వాళ్ళకి మాకేంది సామే టికెట్టు. తిండికి జరగనోళ్ళం అదెక్కడ కొనగలం"

"ఈ సారిగనక మమ్మల్ని డబ్బులడిగే వంటే టి.సి.కి. పట్టిస్తాం" అన్నాడు పేక ముక్కలు పంచుతున్నతను.

వైట్ కాలర్ జాబ్స్ చేస్తూ ప్రభుత్వాన్ని మోసగిస్తున్న వాళ్ళు దర్జాగా మాట్లాడు తుంటే, కృశించిన దేహంతో, ఇతరుల దయాదాక్షిణ్యాలమీద ఆధారపడి బ్రతికే ఆ అనామకుడు జాలిగా అడుక్కొంటున్నాడు.

ఆ శ్రమజీవి అక్కడ్నుంచికదిలి ఇంకో వైపు వెళ్లాడు.

ఇంతలో రైలు స్టేషన్ను సమీపిస్తోందనడానికి గుర్తుగా స్లో అయింది. అప్పటి వరకు కంపార్టుమెంటులో కుడివైపు కిటికీ దగ్గర సింగిల్ సీటులో దర్జాగా కాలుమీద కాలువేసుకొని కూర్చుని ఉన్న కాషాయాంబరధారి చప్పున పైకిలేచి వెండిపళ్లెం బయటకు చాచి "భం... భం... భం... నేను అయ్యప్ప కొండకు జ్యోతికి పోతున్నాను స్వామి. ధర్మం జేసి పుణ్యం కట్టుకోండి స్వామి, స్వామియే శరణం అయ్యప్ప" అరుస్తూ సీటు సీటు దగ్గరకూ వెళ్లాడు.

టపటపమంటూ అతని పళ్ళెంలో చిల్లర నాణేలు. కొండొకచో కరెన్సీనోట్లు రాలసాగాయి. చిల్లరకూడా పావలాకు తక్కువ ఎవరూ వేయలేదు.

పేకాడు కొంటున్న వాళ్ళంతా దేవుడు చూస్తాడేమోనని తమ ముక్కల్ని టవలు క్రింద మూసేసారు.

కాషాయాంబరధారి వాళ్ళని దీవించాడు. అతను శబరిమలై పోతాడని ఏమాత్రం నమ్మకంలేని ప్రసాద్ అతనివైపు కూడా చూడ్లేదు.

ఇంతలో స్టేషను వచ్చేసింది. కాషాయంబరధారి తన పళ్ళెంలో ఉన్న చిల్లరనాణాలను, కరెన్సీ కాగితాలను జోలెలో వేసుకొని వాకిట్లో ఉన్న అనామకుడ్ని పురుగును చూసినట్లు చూసి తన మహాకాయం అతని శరీరానికి తగలకుండా జాగ్రత్తగా దిగాడు.

బండి ఆగీ అగగానే ఒకర్నొకరు తోసుకొంటూ అందరూ దిగారు. అనామకుడు తను ముందే క్రిందకి దిగి గుమ్మానికి ఒక వైపు ఒదిగి చేయిజాచి అందర్నీ దీనంగా చూసాడు. ఒక్కరూఅతన్ని పట్టించుకోలేదు.

ప్రసాద్ అనామకుడి కెదురుగా నిలబడి అతని ముఖంలోకి చూసాడు. చప్పున జేబులోంచి అయిదు రూపాయల నోటు తీసి అనామకుడి చేతిలో ఉంచాడు.

ప్రసాద్ నాస్తికుడేం కాదు. ఆస్తికుడే. అతనికి అందరి దేవతలమీదా భక్తిఉంది. తేడా ఏమిటంటే అతనికి విగ్రహాల్లో దేవుళ్లు కనిపించరు. మానవత్వంనింపుకున్న అమాయకుల ముఖాల్లో దేవుళ్ళు కనిపిస్తారు.

క్రిందికి దిగి కొద్దిదూరం నడచి వెనక్కు తిరిగి చూసాడు. దగ్గరలో వున్న రైల్వేకాంటిన్ వైపు పొట్టతడుముకొంటూ కాషయాంబరధారి గర్వంగా అడుగులు వేస్తూంటే, అనామకుడు వెన్నుకు అంటుకుపొయిన పొట్టతో వేపమండలు పట్టుకొని ఇంకో కంపార్టు మెంటు ఎక్కుతున్నాడు.

అందరూ జీవించటానికి ఏదో ఒక బ్రతుకు దెరువు చూసుకోవాల్సిందే, కాని ఆబ్రతుకు తెరువుల్లో కూడా ఎన్నిభేదాలు? ✸

**(స్వాతి వీక్లీ, తేది 12-5-1986)**